సాక్షి
పెద్దపల్లి
సోమవారం। 24। ఏప్రిల్। 2023



మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ

ఓదెల: ఓదెల మల్లన్న స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఒగ్గు పూజారులతో పట్నాలు, బోనాలు చేశారు.



'ఆరోగ్య మహిళ'కు ఆదరణ

రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ పథకానికి ఆదరణ లభిస్తోంది. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం చలిగాలులు కొనసాగుతాయి.

కులవృత్తుల్లో ఈతరం

కనుమరుగవుతున్న కళకు జీవం



పోటీ ఉంది..

నేను బీకాం పూర్తిచేశాను. 12 ఏళ్లుగా మా కులవృత్తిలోనే కొనసాగుతున్నా. కొత్త ఇండ్లకు అవసరమైన మెటీరియల్, మంచాలు, సోఫాలు, తదితర ఫర్నీచర్ తయారు చేస్తుంటాను. మా కులవృత్తిలోనూ పోటీ ఉంది. బిల్డర్లు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు మెటీరియల్ తీసుకెళ్తున్నారు. ప్రభుత్వం కూడా మాకు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తే బాగుంటుంది. – నూతి సంతోశ్‌కుమార్, అమర్‌నగర్, పెద్దపల్లి



ఈ యువడికి పేరు నాగరాజు. గోల్డ్‌స్మిత్. కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌లో నివాసం ఉంటాడు. నాగరాజుకు ఇద్దరు అక్కలు. గతంలో తండ్రి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఇంటిబాధ్యతలు తనపై వేసుకున్నాడు. పీజీ పూర్తిచేసినా.. వేరే ఉద్యోగం వైపు చూడకుండా కులవృత్తిపైనే ఆధారపడ్డాడు. బంగారు ఆభరణాల తయారీపై గోదావరిఖనిలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. తరువాత కరీంనగర్‌లో పనిచేశాడు. ఇద్దరు అక్కల వివాహాలు చేశాడు. ప్రస్తుతం ఇంటివద్దే దుకాణం నిర్వహిస్తూ వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కులవృత్తి అన్నం పెడుతోందని, అందుకే వేరే ఆలోచన చేయలేదని నాగరాజు చెబుతున్నాడు.

- ఆధునికతను జోడిస్తూ.. ఆదర్శంగా నిలుస్తూ..
- కుటుంబానికి అండగా.. ఉపాధితో ఆనందంగా..
- కులవృత్తిలో అధిక సంఖ్యలో నాయీబ్రాహ్మణులు..
- అతితక్కువగా శాలివాహనులు

అంతరించిపోతున్న కళలకు వారుజీవం పోస్తున్నారు. నాటి తరం బాధ్యతను భుజాన వేసుకుని ఈ తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉన్నత చదువులు చదివినా.. కార్పొరేట్ ఉద్యోగాలబాట పట్టకుండా.. పుట్టిన ఊరిలో నమ్ముకున్న కులవృత్తి చేసుకుంటూ సంతోషంగా జీవిస్తున్నారు. తాతలు, తండ్రులు నేర్పిన పనే ఇప్పుడు కుటుంబానికి ఆసరా అవుతోందని చెబుతున్నారు. తాము చేసే పనికి మరింత ఆధునీకతను జోడిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వృత్తిలో మరింత నైపుణ్యత సాధిస్తూ వచ్చిన ఆదాయంతో ఆనందంగా కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న యువతలో ఎక్కువగా నాయీబ్రాహ్మణులు ఉండగా.. అతితక్కువ శాలివాహనులు ఉన్నట్లు సమాచారం. కనుమరుగు అవుతున్న కులవృత్తులకు జీవం పోస్తున్న యువ'తరం'పై..! – సాక్షి, కరీంనగర్ డెస్క్



ఈ యువకుడు ఎనగందుల రాజు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం వెల్ది గ్రామానికి చెందిన రాజు డిగ్రీ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లో మంచి ఉద్యోగ అవకాశం వచ్చింది. అయినా వెళ్లలేదు. గ్రామంలోనే తండ్రి, సోదరుడితో కలిసి సెలూన్ ఏర్పాటు చేసుకున్నారు. నిత్యం ముగ్గురు కలిసి పనిచేస్తున్నారు. ఖర్చులు పోను నిత్యం రూ.500 మిగులుతాయని రాజు చెబుతున్నాడు. తనకు కులవృత్తి చేయడం అంటే ఇష్టమని, అందుకే వేరే ఉద్యోగ అవకాశం వచ్చినా వెళ్లలేదని అంటున్నాడు. అయితే.. పట్టణాల్లో వెలుస్తున్న కార్పొరేట్ సంస్థలు తమ ఉపాధిని దెబ్బతీస్తున్నాయని, ప్రభుత్వం తక్షణమే స్పందించి చిరు వృత్తికారులకు అండగా ఉండి, కార్పొరేట్ సంస్థలకు అనుమతి ఇవ్వొద్దని రాజు కోరుతున్నాడు.



ఈయన తాళ్లపెల్లి మహేందర్‌గౌడ్. సొంతూరు మానకొండూర్ మండలం వెల్ది. కుటుంబ పరిస్థితులు పెద్ద చదువులకు అడ్డంకిగా మారాయి. దీంతో వ్యవసాయం, కులవృత్తే ఇతనికి ఆధారం అయ్యింది. ఉన్న భూమిని సాగుచేసుకుంటూ.. పొద్దున సాయంత్రం తాటిచెట్లు ఎక్కుతూ కల్లుగీస్తుంటాడు. వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇక్కడ విశేషం ఏంటంటే.. ఈ గ్రామంలో ఈయన తరంలో కల్లుగీత కార్మికుల్లో ఇతను ఒక్కడే ప్రస్తుతం పనిచేస్తున్నాడు. మిగితావారందరూ ప్రత్యామ్నాయం చూసుకున్నారు. 'మేము నలుగురం అన్నదమ్ములం. కులవృత్తి చేయడంలో ఆనందం ఉంది. ఒక్కడినే ఊళ్లో ఉంటున్నా. అందరూ ప్రత్యామ్నాయం వెతుక్కున్నారు. ప్రభుత్వం మాకు అండగా ఉండాలి' అని మహేందర్ కోరుతున్నాడు.

ఆధునికతను జోడిస్తూ..

ప్రస్తుతకాలంలో కులవృత్తి చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. డిగ్రీపూర్తికాగానే ప్రయివేటు ఉద్యోగమో.. ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రిపరేషనో చేస్తున్నారు. ఇలా గత రెండు,మూడు దశాబ్దాల నుంచే కులవృత్తులు అంతరించిపోవడం కనిపిస్తోంది. అందివచ్చిన మిషనరీ చాలా కులవృత్తులను చావుదెబ్బ కొట్టగా... గ్రామాల్లోని యువతకు చేతిలో పనిలేకుండా పోయింది. కార్పొరేట్ కంపెనీలు.. రెడీమేడ్ వస్తువులు చేతివృత్తులపై ప్రభావం చూపాయి. చాలా మంది పనుల నిమిత్తం వలస వెళ్లిన సందర్భాలు అనేకం. అయితే ప్రస్తుత యువత ప్రజల అభిరుచికి అనుగుణంగా వారి కులవృత్తిలో ఆధునీకతను జోడిస్తూ ముందుకు సాగుతున్నారు. రెడీమేడ్, పట్టణాల్లో ఉండే సదుపాయాలను గ్రామాల్లోనూ కల్పిస్తూ కులవృత్తులకు జీవం పోస్తున్నారు.

ట్రెండ్ సెట్ చేస్తూ..

ప్రస్తుత యువత కులవృత్తిలో నయా ట్రెండ్ సెట్ చేస్తున్నారు. వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా నడుచుకుంటున్నారు. నాయీబ్రాహ్మణులు పల్లెల్లోనూ పట్టణాల్లో ఉండే విధంగా సెలూన్లు తీర్చిదిద్దుతున్నారు. కొత్తకొత్త హెయిర్‌స్టైల్‌తో ఆకట్టుకుంటున్నారు. గోల్డ్‌స్మిత్‌లు పెద్దపెద్ద బంగారు దుకాణాల్లో దొరికేవాటికన్నా సరికొత్త డిజైన్లు తయారు చేస్తున్నారు. వివిధ సైట్లలో సెర్చ్ చేస్తూ అందమైన పసిడి ఆభరణాలు తయారు చేస్తున్నారు. కార్పెంటర్లు కూడా కంప్యూటరైజ్డ్ డిజైన్లు తయారు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకమైన శిక్షణ తీసుకుంటూ.. కంటికి ఇంపైన ఇంటీరియల్ తయారు చేస్తూ కస్టమర్లను ఆకట్టుకుంటున్నారు. అదే విధంగా వివిధ కులవృత్తుల యువత ప్రస్తుత టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ చేతివృత్తులకు సరికొత్త నిర్వచనం ఇస్తున్నారు.

వీరు ఎక్కువ...

ఉమ్మడి జిల్లా పరిధిలో నాయీబ్రాహ్మణుల్లో ఎక్కువగా యువత కులవృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. 10వేలకు మందికి పైగా యువత పట్టణాలు, గ్రామాల్లో సెలూన్లు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. నిత్యం రూ.500నుంచి రూ.1000 వరకు సంపాదిస్తామని పలువురు చెబుతున్నారు. తరువాత రజకులు 5వేల మంది వరకు కలవృత్తిపై ఆధారపడ్డారు. అయితే వీరికి గ్రామాల్లో తక్కువగా ఉపాధి ఉండగా.. పట్టణాలకు వలసవెళ్తున్నారు. కరీంనగర్‌లో అత్యధిక మంది యువత లాండ్రీపై ఆధారపడి బతుకుతున్నారు. విశ్వబ్రాహ్మణుల్లోనూ చాలా మంది సొంతంగా వ్యాపారాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 4వేలకు పైగా మంది గోల్డ్‌స్మిత్, కార్పెంటర్, ఫర్నిచర్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. గౌడకులస్తుల్లో యువత కల్లుగీయడానికి ముందుకు రావడం లేదు. ఒక్కోగ్రామంలో ఒక్కరిద్దరు మాత్రమే కల్లుగీసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3వేల మంది వరకు యువత కల్లుగీతపై ఆధారపడి బతుకుతున్నారు. సిరిసిల్లలో బట్టల తయారీలో యువతరం తమ ప్రతిభ చాటుతోంది. మత్స్యకారుల కుటుంబాల్లోనూ యువత చేపలు పడుతూ ఉపాధి పొందుతున్నారు. ఎల్ఎండీ, మిడ్‌మానేరు, ఎగువమానేరు, కాళేశ్వరంతో ఉపాధి పెరిగిందని చెబుతున్నారు. ఇక మేరు, శాలివాహనులు, తదితర కులస్తులు తమ వృత్తిలో ఉపాధి లేకపోవడంతో ప్రత్యామ్నాయ బాటపడుతున్నారు. ప్రతీ కులస్తులు ప్రభుత్వం నుంచి సాయం అందించాలని కోరుతున్నారు. తమ వృత్తికి సంబంధించి సబ్సిడీలు, ప్రభుత్వ పథకాలు అందించాలని కోరుతున్నారు. సర్కారు ప్రోత్సాహం ఉంటే తాము మరింత ఉత్సాహంగా పనిచేస్తామని, తమ వృత్తులను బతికించుకుంటామని చెబుతున్నారు.

అమ్మానాన్నకు తోడుగా..



మాది కరీంనగర్. నాన్న చిరుద్యోగి. అమ్మ కులవృత్తే చేస్తుంది. నేను డిగ్రీ పూర్తిచేశాను. ప్రస్తుతం ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నా. ఇంట్లోనే లాండ్రీ షాపు నడిపిస్తాం. నాన్న డ్యూటీకి వెళ్లినప్పుడు నేనూ ఇస్త్రీ చేస్తుంటాను. పొద్దంతా ఉద్యోగానికి వెళ్లివచ్చి సాయంత్రం కులవృత్తి నిర్వహిస్తుంటా. మా పని మేము చేసుకోవడంలో ఆనందమే వేరు. ప్రభుత్వం ఇంట్లోని లాండ్రీలకు కూడా విద్యుత్‌లో రాయితీ ఇవ్వాలి. – నరేశ్, హనుమాన్‌నగర్, కరీంనగర్

15ఏళ్లుగా ఇదే పని..



మాది సిరిసిల్లలోని సుందరయ్యనగర్. నేను పెద్దగా చదువుకోలేదు. నాకు 17ఏళ్ల వయసున్నప్పుడు నుంచి మర మగ్గాల కార్మికుడిగా పనిచేస్తున్నాను. దాదాపు 15ఏళ్లకు పైగా ఇదే వృతిలో కొనసాగుతున్నాను. వారానికి రూ.2000–2500 వరకు సంపాదిస్తాను. నాకు ఇద్దరు పిల్లలు. వచ్చిన ఆదాయం కుటుంబపోషణకే సరిపోతోంది. – పిక్కల శేఖర్, సిరిసిల్ల

ప్రభుత్వం దయచూపాలి



నేను 16ఏళ్ల నుంచి పెద్దపల్లిలో దర్జీగా పనిచేస్తున్నా. మా నాన్న నుంచి ఈ పని నేర్చుకున్నాను. ప్రస్తుతం రెడీమేడ్ వస్త్రాలతో గిరాకీ బాగా తగ్గిపోయింది. వచ్చే ఆదాయం కుటుంబ పోషణకే సరిపోతోంది. ఇక ఈ వృత్తిలోకి మా పిల్లలను రానివ్వను. ప్రభుత్వం మాపై దయచూపాలి. స్కూల్ యూనిఫాంలు కుట్టేబాధ్యత మాకే ఇవ్వాలి. ఇతర కులస్తులకు రాయితీపై బట్టలు కుట్టే మిషనరీలు ఇస్తున్నారు. అవి మాకూ ఇస్తే బాగుంటుంది. రెడీమేడ్‌పై ట్యాక్స్ విధించాలి. – మంథని నర్సింగ్, పెద్దపల్లి

ఏటా మునుగుడే..!

- అన్నదాతను వెంటాడుతున్న అకాల వర్షాలు
- చేతికందే సమయంలో ప్రకృతి కన్నెర్ర
- ప్రభుత్వ పరిహారంపైనే రైతుల ఆశలు



ఈ ఫొటోలోని రైతు ఎర్రం సమ్మయ్య. ముత్తారం మండలం మైదంబండ. రెండెకరాల్లో మొక్కజొన్న పంట వేశాడు. శనివారం ఈదురుగాలులకు పంట నేలవాలింది. ఈ రైతుకు రూ.50వేలకు పైగానే నష్టం వాటిల్లింది.



సుల్తానాబాద్‌లో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

సుల్తానాబాద్/మంథని: అన్నదాతలను అకాలవర్షాలు కలవరపెడుతున్నాయి. వడగండ్లకు తోడు ఈదురుగాలులు వీస్తుండటంతో మామిడి, మొక్కజొన్న, కూరగాయలు ఇతర పంటలకు నష్టం వాటిల్లింది. శనివారం పలు ప్రాంతాల్లో రాళ్లతో కూడిన వర్షం కురవడంతో వరిపంటలు ధ్వంసమయ్యాయి. వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సర్వే చేసి మండల వ్యవసాయ అధికారుల ద్వారా జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డికి ప్రాథమిక సమాచారాన్ని చేరవేశారు. వారి నివేదిక ప్రకారం.. జిల్లావ్యాప్తంగా 9,180 మంది రైతులు 14,829 ఎకరాల్లో పంటలు నష్టపోయారు. అయితే వరికి సంబంధించి రైతులవారీగా పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నామని, ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు..? ఎంత నష్టం వాటిల్లింది..? అనే వివరాలు తీసుకుంటున్నామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలకు పంటలు పూర్తిగా ధ్వంసమైన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహరెడ్డి తెలిపారు.

ప్రతి ఏటా నష్టమే..

రైతులు వరి, మొక్కజొన్న, అరటి, ఇతర పంటల సాగుకు ఎకరాకు రూ.20వేల నుంచి రూ.60 వేల పెట్టుబడి అవుతుంది. తెగుళ్ల ఆశించడం, కూలీలు, కోతమిషన్ల ధరలు కూడా పెరగడంతో పెట్టుబడి భారీగా పెరుగుతోంది. మరోవైపు ప్రతిఏటా ప్రకృతి ప్రకోపానికి నష్టపోతూనే ఉన్నాడు. కనీసం పెట్టుబడి కూడా చేతికందని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు.

తాజా ఉత్తర్వులు వర్తిస్తాయా...?

రాష్ట్రంలో ప్రకృతి ప్రకోపానికి పంటలు నష్టపోయిన రైతులకు ఏడేళ్లుగా పరిహారం అందడం లేదు. అయితే 20 రోజుల క్రితం కురిసిన అకాలవర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన సీఎం ఎకరాకు రూ.పదివేలు ఇస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో రెండురోజుల క్రితం కురిసిన వర్షానికి నష్టపోయిన రైతులకు అదే ఉత్తర్వులు వర్తిస్తాయా..? లేదా..? ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి

జిల్లాలో శనివారం కురిసిన వర్షానికి నష్టపోయిన పంటలు (వ్యవసాయ అధికారుల అంచనా ప్రకారం..)

పంట	ఎకరాలు	రైతులు
వరి	13,548	8,339
మొక్కజొన్న	627	602
కూరగాయలు	224	15
ఇతరత్రా	430	224
మొత్తం	14,829	9,180

ఎలిగేడులో 5,441 ఎకరాల్లో నష్టం

ఎలిగేడు: మండలంలోని 12 గ్రామాల్లో 5,441 ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు ఏవో ఉమాపతి తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం పూర్తిగా తడిసిందని, దానిని ప్రభుత్వమే కొనాలని రైతులు కోరారు.



రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

సుల్తానాబాద్‌రూరల్: అకాలవర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ప్రభుత్వానికి సూచించారు. సుల్తానాబాద్ మండలం భూపతిపూర్, ఐతరాజుపల్లి, నర్సయ్యపల్లి, గర్రెపల్లి గ్రామాల్లో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. చేతికొచ్చిన పంట నష్టపోయి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదన్నారు. వ్యవసాయ అధికారులతో సర్వే చేయించి ఎకరాకు రూ.30వేల చొప్పున ఇప్పించాలని సూచించారు.

పరిహారం చెల్లించి ఆదుకోండి



రెండెకరాల్లో అరటి సాగు చేసిన. భారీ ఈదులుగాలులకు పంట మొత్తం దెబ్బతింది. పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం ఆదుకోకుంటే ఆగమే. పరిహారం చెల్లించి ఆదుకోవాలే – బోడ తిరుపతి, హరిపురం, మంథని

ప్రభుత్వం స్పందించాలి



వరి పంట పూర్తిగా దెబ్బతింది. వడ్లు నేలపాలయ్యాయి. అధికారులు వరి పంటను పరిశీలించి రైతులకు నష్టం కాకుండా చర్యలు తీసుకోవాలి. నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇచ్చేలా ప్రభుత్వం చొరవ చూపాలి. – మేడి తిరుపతి, రైతు, ధూళికట్ట

నష్టాన్ని అంచనా వేస్తున్నాం



గ్రామాల వారీగా రైతులు వేసిన పంటలను వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రాథమిక అంచనాకు వచ్చాం. పూర్తిస్థాయిలో విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం. – ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

ఇష్టారీతిన మాట్లాడితే ఊరుకోబోం..



ఈటల రాజేందర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మక్కాన్ సింగ్, కాంగ్రెస్ నాయకులు

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోబోమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక ప్రధాన చౌరస్తాలో ఎమ్మెల్యే ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం మాట్లాడుతూ దేవునిమాన్యాల భూములను అక్రమంగా కబ్జా చేసిన ఈటలను బీఆర్ఎస్ సస్పెండ్ చేస్తే.. భూకబ్జాలు, కోళ్లఫారాలను కాపాడుకునేందుకు బీజేపీలో చేరారని పేర్కొన్నారు. బీజేపీలో ఆయనకు ఇప్పటి వరకు ప్రాధాన్యత లేక అయోమయంలో ఉన్న ఈటల కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ద్వారానే అభివృద్ధి సాధ్యమని ప్రజలందరూ విశ్వసిస్తున్నారని తెలిపారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈటలకు నిజాయితీ ఉంటే భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయానికి ఎందుకు రాలేదన్నారు. తమ నేత రేవంత్‌రెడ్డి గుడిలోకి వెళ్లి ప్రమాణం చేసి వచ్చారని తెలిపారు. బీసీ బిడ్డగా గౌరవిస్తున్నామని, తక్షణమే తప్పును సవరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ఈనెల 25న నిర్వహించే నిరుద్యోగ దీక్షకు పారిశ్రామిక ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత తరలిరావాలన్నారు. నాయకులు కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, ముస్తాఫా, గట్ల రమేశ్, పెద్దెల్లి ప్రకాశ్, అరుణ్‌కుమార్, కౌటం సతీశ్, గాదం విజయానంద్, తేజస్విని, తాళ్లపల్లి యుగేందర్, నజీముద్దీన్, చుక్కల శ్రీనివాస్, నాయిని ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

వకీల్‌పల్లిగనిని సందర్శించిన కలెక్టర్



గనిలోకి వెళ్తున్న కలెక్టర్ సంగీత

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని వకీల్‌పల్లి గనిని ఆదివారం కలెక్టర్ సంగీత సందర్శించారు. గని ఏజెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆమెకు స్వాగతం పలికి.. బొగ్గు ఉత్పత్తి, రక్షణ, తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మ్యాన్‌రైడింగ్ ద్వారా గనిలోకి వెళ్లి బొగ్గు ఉత్పత్తి జరిగే తీరును కలెక్టర్ పరిశీలించారు. ఓసీపీ–3 ప్రాజెక్టును సందర్శించారు. వ్యూపాయింట్ ద్వారా క్వారీని పరిశీలించి బొగ్గు వెలికితీసే తీరు, భారీ యంత్రాల పనితీరు గమనించారు. రాష్ట్ర విద్యుత్ వినియోగానికి అవసరమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్న ఉద్యోగులను అభినందించారు. కలెక్టర్ వెంట మేనేజర్ రవికిరణ్, సీనియర్ సెక్యూరిటీ అధికారి పీవీ.రమణ, సీనియర్ ఎస్టేట్స్ అధికారి జే.సునీత, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్ తదితరులున్నారు.

రైల్వేస్టేషన్ పెద్దదే.. అన్నీ సమస్యలే

- గూడ్స్ రవాణాతో వచ్చే ఆదాయంపైనే ప్రత్యేక దృష్టి
- ప్లాట్‌ఫాంలపై కనీస సౌకర్యాలు కరువు
- రామగుండంలో ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- రైల్వేశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు



రామగుండం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై మూసి ఉన్న టీ, టిఫిన్ స్టాల్స్

రామగుండం: గూడ్స్ రవాణాతో వచ్చే ఆదాయంపైనే రైల్వేశాఖ ప్రత్యేక దృష్టిసారిస్తూ ప్రయాణికుల మౌలిక సదుపాయాల కల్పనపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలున్నాయి. రామగుండం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోనే అతి పెద్ద రైల్వేస్టేషన్ ఇక్కడుంది. స్థానిక పరిశ్రమలలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన అనేక మంది ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాలకు కనెక్టివిటీ ఉన్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రామగుండం కేంద్రంగా రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతీరోజు సుమారు 20 వేల మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తుంటారు.

టీ తాగాలన్నా బయటకు వెళ్లాలి..

రైల్వే జనరల్ మేనేజర్, డీఆర్ఎం తదితర ఉన్నతాధికారులు రైల్వేస్టేషన్‌ను సందర్శించే క్రమంలో ఇక్కడి అధికారులు చేసే హడావుడి మామూలుగా ఉండదు. వారి రాకకు ముందు మౌలిక సదుపాయాల కల్పనపై కోట్లాది నిధులు వెచ్చిస్తున్నప్పటికీ ఫలితం ఉండటం లేదు. ముఖ్యంగా ప్లాట్‌ఫాంపైకి చేరిన ప్రయాణికుడు కనీసం టీ తాగాలన్నా లగేజీ వద్ద ఎవరినైనా కాపలా ఉంచి బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

తాగునీరు, భద్రత లేవు..

ముఖ్యంగా ఒకటి, రెండో ప్లాట్‌ఫాంలపై స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, తమ వాహనాలకు భద్రతతో కూడిన పార్కింగ్ లేవు. టీ, టిఫిన్, వాటర్, స్నాక్స్ స్టాల్స్ ఓపెన్ చేయకపోవడం, మరుగుదొడ్ల కాంప్లెక్స్ మూసి ఉంచడం, కనీసం మినరల్ వాటర్ బాటిల్స్ విక్రయ స్టాల్స్ లేకపోవడం, బుకింగ్ కౌంటర్‌లో టికెట్ల విక్రయాలకు ఆన్‌లైన్ పేమెంట్ అవకాశం కల్పించకపోవడం తదితర సమస్యలు ప్రయాణికులను వెంటాడుతున్నాయి. రైల్వేస్టేషన్ ప్రాంగణంలో కనీసం పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా



ప్లాట్‌ఫాంపై టీ, టిఫిన్ స్టాల్స్ మూసి ఉంటున్న విషయమై రైల్వే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా. తాగునీరు, పబ్లిక్ పేయిడ్ టాయిలెట్స్ ఇతరత్రా సమస్యలను వారికి వివరిస్తా.

– అనుమాస శ్రీనివాస్, డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు

పేరుకే పెద్ద రైల్వేస్టేషన్..



మా బంధువులు సుదూర ప్రాంతాలకు వెళ్లే క్రమంలో రామగుండం రైల్వేస్టేషన్‌కు వస్తే కనీసం టీ తాగించలేని దుస్థితి ఉంది. పేరుకే పెద్ద రైల్వేస్టేషన్. కనీసం తాగునీరు, టీ, టిఫిన్స్ లేవు.

– మేకల రమేశ్, ప్రయాణికుడు, రామగుండం

పార్కింగ్ ఫీజు అడ్డగోలు..



రైల్వేస్టేషన్‌కు వచ్చేవారి వాహనాలకు భద్రత లేదు. షెడ్డు ఏర్పాటు చేయలేదు కానీ పార్కింగ్ ఫీజు అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు. రైల్వేశాఖ కనీస సౌకర్యాలను పట్టించుకోకపోవడం దురదృష్టకరం.

– అరుణ్‌కుమార్, ప్రయాణికుడు, ఖమ్మం

'ఆరోగ్య మహిళ'కు ఆదరణ

- గత నెల 8న పథకం ప్రారంభం
- జిల్లాలో 3 పీహెచ్‌సీల ఎంపిక
- ప్రతి మంగళవారం 8 రకాల వైద్య పరీక్షలు
- ఉచితంగా మందుల పంపిణీ
- వినియోగించుకుంటున్న మహిళలు


వైద్య పరీక్షల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సంగీత

సుల్తానాబాద్(పెద్దపల్లి): రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ పథకానికి ఆదరణ లభిస్తోంది. 'మహిళల ఆరోగ్యం–ఇంటింటికీ సౌభాగ్యం' నినాదంతో అమలు చేస్తున్న కార్యక్రమంపై అధికారులు మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలోని 3 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గత నెల 8న పథకాన్ని ప్రారంభించారు. ప్రతి మంగళవారం 8 రకాల వైద్య పరీక్షలు చేసి, మందులు ఉచితంగా ఇస్తుండటంతో మహిళలు ఎక్కువ మంది వినియోగించుకుంటున్నారు.

5 వారాల్లో 2,871 మందికి వైద్య సేవలు..

జిల్లాలోని రాగినేడు, గద్దలపల్లి, రామగుండం పీహెచ్‌సీల్లో ఆరోగ్య మహిళ సేవలు అందిస్తున్నారు. ఆయా కేంద్రాలకు చెందిన వైద్యులు, సిబ్బందికి ఇప్పటికే ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. స్కానింగ్, వ్యాధి నిర్ధారణ పరీక్షలు అవసరమైన వారిని జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. కేన్సర్, పౌష్టికాహారలోపం, మూత్రకోశ, నెలసరి, సుఖవ్యాధులు, తక్కువ బరువు, సంతానలేమి, కుటుంబ నియంత్రణ, మెనోపాజ్ వంటి సమస్యలకు వైద్యం అందిస్తున్నారు. గడిచిన 5 వారాల్లో జిల్లావ్యాప్తంగా 2,871 మందికి వైద్య సేవలందించినట్లు వైద్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి, కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

పలు రకాల అనారోగ్య సమస్యలు..

ఆరోగ్య మహిళా కేంద్రాలకు వచ్చిన పలువురు మహిళల్లో పలు అనారోగ్య సమస్యలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వీరిలో గతంలోనే థైరాయిడ్‌తో బాధపడుతున్న వారు 152 మంది ఉండగా.. కొత్తగా మరో 23 మందికి సమస్య ఉన్నట్లు నిర్ధారించారు. ఓరల్ కేన్సర్ అనుమానిత పరీక్షలు 136 మందికి నిర్వహించగా 9 మందికి వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. బ్రెస్ట్ కేన్సర్ పరీక్షలు 920 మందికి చేయగా 4గురు అనుమానితులను రిఫర్ చేశారు. 326 మందికి సర్వైకల్ కేన్సర్ పరీక్షలు చేసి, ఇద్దరికి వ్యాధి ఉన్నట్లు తేల్చారు. పోషకాహారలోపం కారణంగా 109 మంది బరువు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు 80 మంది ఉన్నారు. వీరందరికీ 10.9 గ్రాముల కన్నా తక్కువ రక్తం ఉంది. మూత్రకోశ సమస్యలకు సంబంధించి 97 మంది రాగా ఐదుగురికి వ్యాధులున్నట్లు తేల్చారు. నెలసరి సమస్యలతో 670 మంది చికిత్స తీసుకోగా 110 మందిని జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఇక సుఖవ్యాధులకు 14 మంది చికిత్స తీసుకున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఆరోగ్య మహిళా కేంద్రాల్లో వ్యాధులు నిర్ధారణ మహిళల వివరాలను ఆశ వర్కర్లు ఫాలోఅప్ చేయాలి. 8 రకాల వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నారు. మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– సంగీత, కలెక్టర్

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



ఆరోగ్య మహిళ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నాం. ఇతర ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో ప్రోగ్రాం ఆఫీసర్లను నియమించి, మహిళలను చైతన్యపరుస్తున్నాం.

– ప్రమోద్‌కుమార్, డీఎంహెచ్‌వో


రూ.5.45 కోట్లతో సుల్తానాబాద్ అభివృద్ధి

- శాశ్వత మంచినీటి పథకానికి రూపకల్పన
- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో చేరిన 500 మంది కాంగ్రెస్ నాయకులు


కాంగ్రెస్ కౌన్సిలర్ లక్ష్మిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్(పెద్దపల్లి): బీఆర్ఎస్ పాలనలో సుల్తానాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. స్థానిక ఎస్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బల్దియా తొమ్మిదో వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ గొట్టం లక్ష్మి కుమారుడు గొట్టం మహేశ్ ఆధ్వర్యంలో సుమారు 500 మంది పార్టీలో చేరగా.. వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ముందుగా భారీర్యాలీ నిర్వహించారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని, బల్దియా అభివృద్ధికి రూ.5కోట్లు కేటాయించారని, స్థానిక చెరువు కట్ట నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు రహదారి, మండల కేంద్రం నుంచి నీరుకుల్ల వరకు డబుల్ రోడ్డు, పూసలకు డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, పూసల నుంచి ఎలిగేడు మండలం ర్యాకలదేవ్‌పల్లి వరకు బీటీరోడ్డు, సుద్దాల, రేగడి మద్దికుంటకు బీటీ రోడ్డు, తెలంగాణ చౌరస్తా నుంచి శ్రీరాంపూర్ వెళ్లేందుకు బీటీ రోడ్డు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. సుల్తానాబాద్‌లో అధునాతన ఆసుపత్రి నిర్మించామని, సాధారణ ప్రసవాలు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శాశ్వత మంచినీటి పథకానికి రూ.45 లక్షలతో మానేరు నుంచి పైపులైన్ నిర్మాణం చేపట్టామన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత బీఆర్ఎస్‌దేనని పేర్కొన్నారు. ఒక్కో కార్యకర్త వంద ఓట్లు తేవాలని సూచించారు. పార్టీలో చేరిన గొట్టం స్వప్న, రమాకాంత్, రణధీర్, సంతోష్, టింకు, వినీత, అమృతమ్మ, సంస్కృతి, కొమురమ్మ, రజిని, లత, మౌనిక, వరలక్ష్మీకి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు, మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత, సింగిల్ విండో చైర్మన్లు శ్రీగిరి శ్రీనివాస్, జూపల్లి సందీప్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర మౌనిక, పార్టీ మండల అధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్ రావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, పార్టీ పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ధార్మిక సాహిత్య పురస్కారానికి ఎంపిక


గంద్ర లక్ష్మణరావు

కరీంనగర్ కల్చరల్: జాతీయ సాహిత్య పరిషత్ తెలంగాణ రాష్ట్రం తరపున ఏటా అందించే జాతీయ సాహిత్య పరిషత్ వెంకటరావు పంతులు ధార్మిక సాహిత్య పురస్కారానికి 2021 సంవత్సరానికి గాను సాహితీవేత్త డాక్టర్ గంద్ర లక్ష్మణరావు ఎంపికయ్యారు. ఈ మేరకు పురస్కార కమిటీ కన్వీనర్ ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ ఆయన పేరును ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ నెల 30న వికారాబాద్‌లో జాతీయ సాహిత్య పరిషత్ 19వ రాష్ట్ర మహాసభల్లో అవార్డు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పరిషత్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాజుల రవీందర్, నంది శ్రీనివాస్, వారాల ఆనంద్, స్తంభంకాడి గంగాధర్, శ్రీనివాస్ జీయంగార్, కేఎస్ అనంతాచార్య, వేణుశ్రీ తదితరులు లక్ష్మణరావుకు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

అమెరికా కౌన్సిల్ సభ్యుడిగా పెద్దపల్లివాసి



గిరిధర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలో పుట్టి, పెరిగి, అమెరికాలో స్థిరపడిన పెరంబుదూర్ గిరిధర్ అక్కడి సెయింట్ లూయిస్ స్టేట్ కౌన్సిల్‌కు జరిగిన ఎన్నికల్లో సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆయన పెద్దపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి వరకు చదివారు. అమెరికాలో కౌన్సిల్ సభ్యుడిగా గిరిధర్ ఎన్నికవడం పట్ల బాల్యమిత్రులు అక్కపాక నరేశ్, ముత్తు శ్రీనివాస్, సలావుద్దీన్, బుర్ర శ్రీనివాస్, రవి, భుజంగరావు, బాలసాని రాజు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

స్తంభం పైనుంచి పడి జేఎల్‌ఎంకు తీవ్ర గాయాలు


గాయపడిన జేఎల్‌ఎం స్వామి

మంథని: మున్సిపాలిటీ పరిధిలోని పవర్‌హౌస్ కాలనీలో జూనియర్ లైన్‌మెన్ కోరవేణ స్వామి ఆదివారం విద్యుత్ స్తంభం పైనుంచి పడి, తీవ్రంగా గాయపడ్డారు. శనివారం గాలివాన కారణంగా స్తంభాలు పడిపోవడంతో మరమ్మతు చేస్తున్నారు. ఆ సమయంలో స్వామి ప్రమాదానికి గురయ్యారు. ఆయనకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి, కరీంనగర్ తరలించారు.

ట్రాక్టర్ కింద పడి బాలుడి దుర్మరణం


జశ్వంత్ (ఫైల్)

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని కాచాపూర్‌లో ఓ బాలుడు ట్రాక్టర్ కింద పడి మృతిచెందాడు. ఎస్సై వెంకటకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కాచాపూర్‌కు చెందిన బాలసాని రవీందర్ రెండో కుమారుడు జశ్వంత్(9) స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లి, తిరిగి ఇంటికి వస్తున్నాడు. దారిలో ట్రాక్టర్ కనిపించడంతో ఆపి, ఎక్కాడు. డ్రైవర్ సంజీవ్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో జశ్వంత్ కిందపడ్డాడు. ట్రాక్టర్ టైరు పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇందిరానగర్‌లో చోరీ

గోదావరిఖని(రామగుండం): స్థానిక ఇందిరానగర్‌కు చెందిన ఓ జ్యూస్ వ్యాపారి ఇంట్లో దుండగుడు చొరబడి, ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లాడు. స్థానికుల వివరాల ప్రకారం.. వేసవి కాలం కావడంతో వ్యాపారి గుర్రం మహేశ్వర్‌రావు శనివారం రాత్రి తలుపులు తీసి, ఇంటి ఎదుట, ఆయన కుటుంబసభ్యులు లోపల నిద్రించారు. గుర్తు తెలియని వ్యక్తి మహేశ్వర్‌రావు పక్కనుంచే ఇంట్లో చొరబడి, మూడు గ్రాముల బంగారం, ఆరు తులాల గొలుసులు, రూ.11 వేలు చోరీ చేశాడు. బాధితుడు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు తెలిపారు.

జాతీయ రోలార్ స్కేటింగ్‌లో సత్తా చాటాలి



కరీంనగర్ స్పోర్ట్స్: మొహాలీలో జరగనున్న జాతీయస్థాయి రోలార్ స్కేటింగ్ పోటీల్లో సత్తా చాటాలని డీవైఎస్‌వో కీర్తి రాజవీరు అన్నారు. ఈ నెల 26 నుంచి మే 2 వరకు నిర్వహించే జాతీయ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులను ఆదివారం ఆయన అభినందించారు. రోలార్ స్కేటింగ్‌కు జిల్లాలో మంచి ఆదరణ ఉందని, క్రీడాకారులు రాణించడం అభినందనీయమని పేర్కొన్నారు. త్వరలో నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాతీయ పోటీలకు జిల్లా నుంచి అద్విత చౌహాన్, అమృత, రిషిక, శర్నిక్, వికాస్, శాలిని, విశ్వక్, రుషుక్ రెడ్డి, విశృత్‌లు ఎంపికైనట్లు కోచ్ గట్టు అనిల్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని జిల్లా రోలార్ స్కేటింగ్ సంఘం అధ్యక్షుడు ఐలి విజయభాస్కర్, కార్యదర్శి కృష్ణమూర్తి తదితరులు అభినందించారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని అర్కండ్ల శివారులో ఆదివారం ఓ ట్రాక్టర్ బోల్తా పడింది. హార్వెస్టర్‌తో వరి కోస్తుండగా ధాన్యం తరలించేందుకు కన్నాపూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మంద లింగారెడ్డి రాకేశ్ అనే యువకుడితో కలిసి, పొలంలోకి వెళ్తున్నాడు. ఆ సమయంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో రాకేశ్ క్షేమంగా బయటపడ్డాడు. డ్రైవర్ లింగారెడ్డికి స్వల్ప గాయాలవడంతో ఆసుపత్రికి తరలించారు.

ప్రభావిత గ్రామాల అభివృద్ధికి నిధులిస్తున్నాం

- ఆర్జీ–3 జీఎం వెంకటేశ్వర్‌రావు


వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జీఎం వెంకటేశ్వర్‌రావు

కమాన్‌పూర్(మంథని): సింగరేణి ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధి పనులకు, ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు నిధుల కేటాయింపుతోపాటు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వర్‌రావు తెలిపారు. రామగిరి మండలంలోని నాగేపల్లి గ్రామంలో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంపును సర్పంచ్ కొండవేన ఓదెలుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ ఓసీపీ–1 ప్రభావిత గ్రామమైన నాగేపల్లిలో పర్యావరణ రెమిడియేషన్ ప్లాన్‌లో భాగంగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు, నీటి శుద్ధి ప్లాంట్లు, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో వచ్చి, వైద్య పరీక్షలు చేయించుకోగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకుడు గౌతం శంకరయ్య, అధికారులు నరేందర్, డాక్టర్ కిరణ్‌రాజ్, పీవో రాధాకృష్ణ, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, ఉదయ్ హరిజన్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికనే కాంగ్రెస్ టికెట్లు

- ఈసారి పెద్దపల్లి సీటు బీసీలకే దక్కాలి
- టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేశ్‌గౌడ్


మాట్లాడుతున్న రమేశ్‌గౌడ్

పెద్దపల్లిరూరల్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్టానం జనాభా ప్రాతిపదికన టికెట్లు కేటాయించే దిశగా ఆలోచన చేస్తోందని, ఈ సారి పెద్దపల్లి అసెంబ్లీకి బీసీ అభ్యర్థి పోటీలో ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయని టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బుషణవేన రమేశ్‌గౌడ్ అన్నారు. జిల్లాకేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పెద్దపల్లిలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర విజయవంతమైందని, ఆ సమయంలో కొందరి తీరు సరికాదన్నారు. గల్లీలో కొట్లాడితే కాంగ్రెస్‌లో టికెట్లు రావని, ఢిల్లీలోని పార్టీ హైకమాండ్ అనుమతిస్తేనే పోటీచేసే అవకాశం దక్కుతుందని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కల్వల శ్రీనివాస్, నాయకులు విజయ్‌కుమార్, ఎస్పీ రాజయ్య, ప్రశాంత్, శ్రీనివాస్ ఉన్నారు.

పిల్లలపై ప్రవర్తనపై దృష్టిసారించాలి

- చెడు అలవాట్లతో సమాజానికి నష్టం
- బస్తీ బాటలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మధు

మంథని: పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టిసారించాలని, వారిలో ఏమైనా చెడు అలవాట్లు గమనిస్తే వెంటనే మాన్పించాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. బస్తీ బాటలో భాగంగా ఆదివారం మంథని మున్సిపాలిటీ పరిధిలోని పవర్‌హౌస్‌కాలనీ వాసులతో సమావేశమై, పలు అంశాలపై అవగాహన కల్పించారు. కాలనీలో గంజాయి సేవిస్తూ పలువురు యువకులు పట్టుబడ్డారని అన్నారు. ఇలాంటి చెడు అలవాట్లు కుటుంబానికే కాదు సమాజానికి నష్టం చేస్తాయని తెలిపారు. స్థానిక సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. గంజాయి, గుడుంబా, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం అందించినవారి పేర్లు గోప్యంగా ఉంచుతామని మంథని సీఐ సతీశ్ తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, కౌన్సిలర్లు వీకే రవి, గర్రెపల్లి సత్యనారాయణ, కాయిత సమ్మయ్య, నాయకులు పాపారావు, శంకర్‌లాల్, ఎస్సై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లది చీకటి ఒప్పందం

- కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ ప్రభాకర్

కరీంనగర్‌టౌన్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి బీఆర్ఎస్, బీజేపీలు చీకటి ఒప్పందంతో అపూర్వ స్నేహబంధం కొనసాతుందని కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చీకటి ఒప్పందంలో భాగంగానే బీజేపీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ప్రతీ బిల్లుకు బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇచ్చిందన్నారు. గతంలో జరిగిన మునుగోడు, దుబ్బాక, హుజూర్‌నగర్, నాగార్జునసాగర్ ఉప ఎన్నికలు జరుగగా, హుజూర్‌నగర్, నాగార్జునసాగర్‌లో బీజేపీకి రెండు నుంచి మూడు వేల ఓట్లు కూడా రాలేదన్నారు. దుబ్బాకలో ముఖ్యమంత్రి ప్రచారానికి రాకుండా స్వయంగా బీఆర్ఎస్ పార్టీ రఘునందన్‌రావు గెలుపునకు సహకరించిందని విమర్శించారు. హుజురాబాద్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పక్షాన పోటీ చేయాల్సిన అభ్యర్థి కాంగ్రెస్ పార్టీని మోసం చేసి టీఆర్ఎస్ మద్దతు తీసుకొని రహస్య ఎజెండాతో నన్ను ఓడించడానికి పనిచేశారని అన్నారు. టీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి డబ్బులు పంపించిందని ఈటల రాజేందర్ ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండించారు. దీనిపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసినట్లుగా అమ్మవారి వద్ద ప్రమాణం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు రోహిత్‌రావు, కర్రసత్య ప్రసన్నారెడ్డి, మల్యాల సుజిత్ కుమార్, మడుపు మోహన్, కంకణాల అనిల్‌కుమార్, రమేశ్, కీర్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.